# city lights

(కౌనస్ చిబార్బేరియన్)



మెట్లెక్కుతున్నాడతను.

సినిమా మొదలెట్టటానికి ఇంకా సమయం ఉంది.

దారంతా కిక్కిరిసి ఉంది. పక్కనే కొందరు పైకి నడుస్తుంటే కొందరు క్రిందికి దిగుతున్నారు.

నంబరు చూసుకుని సీట్లో కూర్చున్నాక నిట్టూరుస్తూ కళ్ళు మూసుకున్నాడు. అతని మనస్సంతా అలజడిగా ఉంది. చికాగ్గా ఉంది. చిందరవందరగా ఉంది.

ఈ మధ్యనే అతను ట్రాన్స్ఫరుమీద సిటీకి వచ్చాడు. ఇల్లు చూసుకోవటమూ, కుటుంబాన్ని తీసుకురావటమూ, పిల్లల్ని స్కూల్లో జేర్పించటమూ అంతా అయిపోయింది. అన్ని విధాలా సెటిలయిపోయాడు.

కాని...

సినిమా మొదలయింది. మంచు అడివి-గుర్రాల మీద భారీ మనుష్యులు-భారీ ఆయుధాలు......

ఆ రోజు అఫీసులో జరిగిన సంఘటన ఎంత వద్దన్నా అతని మనస్సులోంచి చెదిరిపోవటం లేదు. అసలు దాన్ని మర్చిపోవటానికే సినిమాకు రావటం-కాని కుదరటంలేదు.

ఆ బిల్లు! సామాన్యంగా అన్నీ సక్రమంగా ఉంటే బిల్లుల్ని వెంటవెంటనే పాస్‌చేసి పంపుతుంటాడు తను. కాని ఆ బిల్లు మాత్రం...

"మాకు డబ్బులు చాలా అవసరంగా ఉన్నాయి సార్, మీరా బిల్లును ఇవాళ పాస్ చేస్తే..."

సప్లయర్‌వేపు చూశాడతను. పెద్దమనిషిలా ఉన్నాడు. చాలా చాలా సౌమ్యంగా మాట్లాడుతున్నాడు.

"మీరు సప్లయ్ చేసిన బేరింగులు డూప్లికేటువండీ. ఈ బిల్లును పాస్ చేయటం కుదరదు..."

"డూప్లికేటువని ఎట్లా చెబు

---

దొంగతనం చేసినవాడు చెయ్యలేదని రుజువు చేసుకోవటం తేలిక. కాని చెయ్యని వాడు చెయ్యలేదని రుజువు చేసుకోవాల్సి రావటమన్నది విచిత్రమైన పరిస్థితే కాక అసలా రుజువులనేవి ఎక్కడినుంచి ఎట్లా వస్తాయి?! తనూ వంచనకి పాల్పడితే తప్ప!

---

తున్నారు? బేరింగు పైనా, కవరు మీదా 'ఎస్. కె. ఎఫ్' ముద్రలు చూశారు కదా!''

"ముద్రలదేముంది లెండి, ఇవాళారేపూ ప్రతివాళ్ళూ తయారు చేయగల్గుతున్నారు. మీరు సప్లయ్ చేసినవాటిని ఒరిజినల్ బేరింగులతో కంపేర్ చేసి చూశాను. ఒరిజినల్ బేరింగులో 27 బాల్స్ ఉంటే మీరు సప్లయ్ చేసిన వాటిలో 18 మాత్రమే ఉన్నాయి.''

"కాని వాటిని మీ కొలీగ్ రికార్డు చేశాడు. మీ ఏఈ గారు చెక్ మెజర్ చేశారు. ఈ దశలో మీరు రిజెక్ట్ చేయటం...''

"ఇఈ గారు ఊర్నించి రాగానే ఆయన దృష్టికి తీసుకు వెళ్దామనుకుంటున్నాను.''

తను డ్యూటీలో చేరిన రోజుని ఇఈ అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఇక్కడ ఎన్నో ఏళ్ళ నుంచి అవినీతి పాతుకుపోయి ఉందండీ! ఎవరికి వాళ్ళు తినమరగటం నేర్చారు. ప్రజలసొమ్ము పట్ల ఆ ఉప్పు తింటున్న వాళ్ళుగా తమ బాధ్యతను పట్టించుకోవటం లేదు. వీటిని నేను అరికట్టాలనుకుంటున్నాను. ఆ విషయంలో మీ రెంత నిజాయితీగా ఉంటే అంత సంతోషిస్తాను నేను...''

తెర మీద కానన్ చావుబ్రతుకుల్లో ఉన్నాడు. భూతప్రేత గణాలన్నీ అతని మీదికి దాడికి బయల్దేరాయి. ప్రియుణ్ణి రక్షించుకోవటానికిబలంగా, గుర్రంలా ఉన్న ఆ యువతి తన శక్తినంతా వినియోగిస్తోంది. హోరు, ఉప్పెన...

కాళ్ళబేరానికి వచ్చాడతను.

"చూడండి, మీకు మూడు వందలిస్తాను. బిల్లు నెట్లాగైనా పాస్ చేయండి, ప్లీజ్. మా బాధలు మీకర్థం కావండీ...''

"నాకు మూడు వందలూ, మీకు పాతిక వేలూ కాదండీ ముఖ్యం ఇక్కడ! ఈ బేరింగ్సుని ప్రాజెక్టు గేట్లకు వాడతారు. మీరు సప్లయ్ చేసినవి మూడింట రెండువంతుల శక్తి మాత్రమే కలిగి ఉన్నాయి. వాటిని వేశాక రేపెప్పుడన్నా వరదలు వచ్చి డాము గేట్లు పని చేయకపోతే జరిగే నష్టానికి బాధ్యులు ఎవరవుతారు?''

మూడువందల అంకె వెయ్యికి మారింది. అయినా ఒప్పుకోలేదు తను. ఒప్పుకోదల్చలేదు.

మధ్యాహ్నానికి అతని ధోరణి మారింది.

"మీరు నల్లకుంటలో ఉంటున్నారు కదూ?'' అన్నాడు.

"అవును, అయితే ఏమిటి?''

"మీపిల్లలు శంకర్‌మఠ్‌దాకా నడిచి వచ్చి అక్కడి నుంచి బస్సులో స్కూలుకు వెళ్తున్నారు అవునా?''

"అవును, మీకెట్లాతెలుసు?''

"చూడండీ, కిడ్నాపింగ్ గురించి మీరు వినే ఉంటారు. ఇంత పెద్ద సిటీలో అది తేలికైన విషయం... నేను చాలా పట్టుదల మనిషిని. మీరు వెయ్యి తీసుకోకపోతే వేరే రూటున నేను అయిదు పది వేలు ఖర్చు పెట్టటానికి కూడా వెనుకాడను...''

తెరమీద విలన్‌గాడు సింహాసనం మీద కూర్చుని ఉన్నాడు. పెద్ద పెద్ద పొయ్యిల మీద మానవ కపాలాలు ఉడుకుతూ సూపు తయారవుతోంది. ఆ సూపును ఆరగిస్తూ జంటలు జంటలు శృంగారాన్ని వెలగబెడ్తున్నాయి. విలన్‌గాడికళ్ళలో మార్పు— క్రమక్రమంగా వాడి మొహంలో కూడా మార్పులు వచ్చి పెద్ద సర్పం క్రిందికి మారాడు...

లాభం లేదనుకున్నాడేమో, సప్లయరు తన వద్ద నుంచి లేచి వెళ్ళిపోయాడు. కాసేపున్నాక ఏఈ పిలిపించాడు తనను. ఆయన చేతిలో ఓ కాగితం ఉంది. తను వెళ్ళగానే దాన్ని తన చేతికిచ్చాడు సీరియస్‌గా. అది తన మీద సప్లయరు ఇచ్చిన కంప్లెయింటు-బిల్లు పాస్ చేయటానికి తనతణ్ణి డబ్బు అడిగినట్లూ, అందుకతను ఒప్పుకోకపోయేసరికి తను బిల్లును తొక్కి పెట్టినట్లూ...

కళ్ళు తిరిగినట్లయింది తనకు.

అదే సమయంలో సప్లయర్ లోపలికి వస్తున్నాడు.

"ఏమండీ మిమ్మల్ని నేను బిల్ పాస్ చేయటానికి డబ్బు అడిగానా ?'' కోపంగా అడిగాడు తను.

"అడిగారు కదండీ !'' అమాయకంగా చూస్తూ అన్నాడతను. అతని మొహం చాలా కూల్‌గా ఉంది. ఎక్కడా కోపం గాని, భయం గాని, తన పట్ల ద్వేషం గాని కనిపించడం లేదు.

"ఎప్పుడు? ఎప్పుడడిగాను?'' దిమ్మెరబోతూ తను గబగబా అడిగాడు.

"ప్రొద్దున పన్నెండింటికి. వెయ్యి రూపాయిలిస్తే బిల్లు పాస్ చేస్తాను, లేకపోతే ఏదో వంకన తిరగకొడతానని మీరే అన్నారు కదా !''

ఉలిక్కిపడ్డాడు తను. అబద్ధాన్ని ఎంత నిర్భయంగా చెబుతున్నాడు ?

కానన్ పారిపోతున్నాడు ప్రియురాలితోపాటు. విలన్ మంత్రించి వదిలిన బాణం రివ్వున వెళ్ళి హీరోయిన్ డొక్కలో దిగబడి పాముగా మారింది. చనిపోతోందామె...

ఏం చేయాలి తనిప్పుడు?

దొంగతనం చేసిన వాడు చెయ్యలేదని రుజువు చేసుకోవటం తేలిక. కాని చెయ్యని వాడు చెయ్యలేదని రుజువు చేసుకోవాల్సి రావటమన్నది విచిత్రమైన పరిస్థితే కాక అసలా రుజువు లన్నీ ఎక్కడి నుంచి ఎట్లా వస్తాయి తనూ వంచనకి పాల్పడితే తప్ప! తను కొత్తగా చేరాడిక్కడ. తన కారెక్టర్ ఏమిటో ఎవళ్ళకీ తెలియదు.

గభాల్న సీట్లోంచి లేచి బయటికి వచ్చాడతను. రోడ్డు మీద నడవసాగాడు. వంటరితనం, అంత పెద్ద భవనాలు, అన్నన్ని కార్లు, పక్కవాడి సంగతి పట్టించుకోకుండా ఎవరికి వాళ్ళు అట్లా పరుగులుతీస్తున్న జనాలు- చూస్తుంటే అతనికి అనిపించింది.

ఇంత పెద్ద సిటీలో కేవలం నీతి నియమాల్ని తోడు తీసుకొని వంటరిగా తను బ్రతకగలడా? బ్రతకటం మాటదేముడెరుగు, బలి కాకుండా ఉండే చాలు... *

# సిటీలైట్స్

కంఠంనేని రాధాకృష్ణమూర్తి

